
Follow: @ANNTELUGU
16-08-2026
ANN తెలుగు
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 222 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## విజయ్‌కు త్రిష సెల్యూట్

- తమిళనాడు ఇండిపెండెన్స్ డే వేడుకల్లో ఇంట్రస్టింగ్ సీన్
- వైరల్ గా ఫొటోలు.. వీడియోలు

**చెన్నై, మహా :** తమిళనాడు రాజధాని చెన్నైలోని ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి హోదాలో టీవీకే చీఫ్ విజయ్ తొలిసారి మువ్వెన్నెల జెండా ఆవిష్కరించారు. ఈ జాతీయ పండుగ వేడుకలో ఓ ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. సీఎం విజయ్‌కు ఆయన సహ నటి త్రిష సెల్యూట్ చేశారు. విజయ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తోన్న క్రమంలో ఈ స్పెషల్ మూవెంట్ చోటు చేసుకుంది. త్రిష సెల్యూట్‌తో విజయ్ చిరునవ్వు చిందించారు. కాగా, చెన్నైలోని ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో జరిగిన ఇండిపెండెన్స్ వేడుకలలో త్రిష సందడి చేశారు. సీఎం విజయ్ ఫ్యామిలీ మెంబర్స్‌తో కలిసి వేడుకలకు హాజరైన ఆమె.. విజయ్ తల్లిదండ్రులతో కలిసి ముందు వరుసలో కూర్చున్నారు. ఇండిపెండెన్స్ డే వేడుకల్లో సీఎం విజయ్‌కు త్రిష సెల్యూట్ చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇప్పటికే వీరిద్దరి అనుబంధంపై అనేక రూమర్లు విని పిస్తోన్న తరుణంలో తాజా ఘటనతో విజయ్, త్రిష రిలేషన్ షిప్‌పై మళ్లీ చర్చ మొదలైంది.


టాప్ న్యూస్



### మినిస్టర్ జగ్గారెడ్డి? సీఎం కొత్త వ్యూహం

- సంగారెడ్డి సభలో సిగ్నల్స్


03



### పవన్ కల్యాణ్‌కు తీవ్ర జ్వరం

- కాకినాడ నుండి నేరుగా హైదరాబాద్ కు
- రాజమహేంద్రవరం కార్యక్రమం మధ్యలోనే ముగింపు
- వైద్యుల ప్రాథమిక చికిత్సతో ఉపశమనం

03



### ఇప్పటికైనా సరిదిద్దండి

- లేదంటే ఉద్యమాలు తప్పవు
- ఇంటర్వ్యూల్లో 90 శాతం అవినీతే
- కేంద్రప్రభుత్వానికి

02

నేడు మూడు జిల్లాల్లో

## సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

**హైదరాబాద్, మహా :** కామారెడ్డి, ములుగు, హనుమకొండ జిల్లాల్లో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ విందుకు సీఎం హాజరుకానున్నారు. అనంతరం మేడారంలో సమ్మక్కసారలమ్మ గద్దెలను దర్శించుకుంటారు. ఆ తర్వాత ములుగులో కొత్త కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభించనున్నారు. ములుగు నుంచి హనుమకొండ వెళ్లనున్న సీఎం రేవంత్‌రెడ్డి, పరకాలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. పరకాలలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొంటారు.



### వందేమాతరం ఆలపించని కేరళ

కేంద్రం ప్రొటోకాల్‌కు భిన్నంగా స్వాతంత్ర్య వేడుకలు

02

రైతులకు ఎవరేం చేశారో..

# అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?

ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా


కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్

## దుష్టుల మాయమాటలు నమ్మొద్దు



- మాట ఇస్తే మట్టిలో కలిసేవరకు నిలబడి ఉంటా
- త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీచేస్తాం
- అగ్గిపెట్టెరావు.. అఘోరారావులు వస్తారు
- శవాలపై పెట్టుబడులు పెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారు
- సంగారెడ్డి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.. జగ్గారెడ్డి లాంటి లీడర్ వేయికోట్లిచ్చినా దొరకడు

02





## మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అందాలి

### ఆ క్రెడిట్ విపక్షాలే తీసుకోవాలి

- ఎర్రకోట నుంచి ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- విధానాల అమలులో మహిళా నాయకత్వం అత్యంత అవసరం
- సప్తదార పేరుతో సరికొత్త నినాదం .. జన్ జీకి అధిక ప్రాధాన్యమని వెల్లడి
- 2036 ఒలింపిక్స్ కోసం దేశవ్యాప్త ప్రతిభాన్వేషణ

**ఢిల్లీ, మహా :** చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం దేశ ప్రగతికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు విపక్షాలు సహకరించాలని కోరారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే దాని క్రెడిట్‌ను కూడా విపక్షాలే తీసుకోవచ్చని అన్నారు. ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని మహిళా రిజర్వేషన్లపై మాట్లాడారు. దేశ విధానాలను రూపొందించడంలో మహిళా నాయకత్వం అత్యంత అవసరమని మోదీ అన్నారు. పంచాయతీలు, పురపాలక సంఘాలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మహిళా ప్రజాప్రతినిధులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని చెప్పారు. స్థానిక సమస్యలను మిగతా 3వ పేజీలో





## దేశానికి ఆదర్శంగా తెలంగాణ





- 32 నెలల మా పాలనా ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి
- తెలంగాణ తలసరి ఆదాయం దేశం కంటే 92 శాతం అధికం
- గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి
- జెండా ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడిప్పుడే స్పష్టంగా కనిపిస్తున్నాయని, దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 92 శాతం అధికంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గోల్కొండ కోట వేదికగా నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి తన ప్రభుత్వ 32 నెలల పాలనలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన పురోగతిని వివరించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిని మరింత వేగవంతం చేసి తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వ్యవసాయాన్ని రైతులకు పండుగగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా కింద ఇప్పటివరకు మిగతా 3వ పేజీలో



## 89 మిల్లుల్లో రూ.927 కోట్ల ధాన్యం మాయం

- 28 కేసులు, 26 మంది అరెస్ట్
- రూ.715 కోట్లు రికవరీ
- విజిలెన్స్ దాడుల్లో విస్తుపోయే నిజాలు

**హైదరాబాద్, మహా :** కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంలో భారీ అక్రమాలు వెలుగులోకి రావడం తీవ్ర సంచలనంగా మారుతోంది. రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 89 రైస్ మిల్లుల్లో 3,72,693.23 టన్నుల ధాన్యం లెక్కల్లో కనిపించలేదని గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ ధాన్యం విలువ సుమారు రూ.927.16 కోట్లు ఉంటుందని

మిగతా 3వ పేజీలో




## వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

స్వర్ణాంధ్ర ఐదున్నర కోట్ల ఆంధ్రుల సంకల్పం

- అవకాశాలను ఆర్థిక శక్తిగా మారుద్దాం
- వచ్చే 20 ఏళ్లలో ప్రపంచాన్ని గెలవాలి
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- అమరావతిలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

02





ఇండోనేసియాలో భారీ భూకంపం

## 38 మంది మృతి

- సునామీ హెచ్చరికలు జారీ
- రిక్టర్ స్కేల్‌పై 7.7 తీవ్రతతో ప్రకంపనలు

02



## ఇండోనేసియాలో భారీ భూకంపం

# 38 మంది మృతి

**సునామీ హెచ్చరికలు జారీ**

**రిక్టర్ స్కేల్‌పై 7.7 తీవ్రతతో ప్రకంపనలు**

మహా : ఇండోనేసియాలో శనివారం తెల్లవారుజామున భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.7 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయి. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 5.58 గంటలకు ఫ్లోరెస్ ప్రాంతంలో ఈ భూకంపం సంభవించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) తెలిపింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. తూర్పు నుసా తెంగారా ప్రావిన్స్‌లోని ఎండే నగరానికి సుమారు 68 కిలోమీటర్ల ఉత్తరవాయువ్య దిశలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రకంపనల తీవ్రత దృష్ట్యా ఇండోనేసియా అధికారులు పలు ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తూర్పు నుసా తెంగారా, పశ్చిమ నుసా తెంగారా, దక్షిణ సులవేసి, ఆగ్నేయ సులవేసి ప్రావిన్సుల్లోని తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీచ్‌లు, నదీ తీరాలకు దూరంగా ఉండటంతో పాటు, అవసరమైతే వెంటనే ఎత్తైన ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు.ప్రధాన భూకంపం తర్వాత అదే ప్రాంతంలో పలు ప్రకంపనలు సంభవించాయి. వీటిలో 6.1 తీవ్రతతో కూడిన ప్రకంపన కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కసారిగా భూమి కంపించడంతో ఫ్లోరెస్ ద్వీపంలోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సునామీ హెచ్చరికల నేపథ్యంలో వందలాది మంది ప్రజలు తమ ఇళ్ల నుంచి బయటకు వచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు యూఎస్‌జీఎస్, ఇండోనేసియా అధికారులు తెలిపారు. తీర ప్రాంతాల్లో సముద్రపు అలల తీరును అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారని అన్నారు.

**ఎత్తైన ప్రాంతాలకు పరుగులు**

అయితే భూకంపం కారణంగా ప్రాణనష్టం, గాయపడిన వారి సంఖ్యపై అధికారిక వివరాలు ఇంకా వెలువడలేదు. సిక్కా ప్రాంతానికి చెందిన యోహన్నా ఎంబు మాట్లాడుతూ, భూకంపం వల్ల అనేక భవనాలు దెబ్బతిన్నాయని, భయపడిన ప్రజలు ఎత్తైన ప్రాంతాలకు పరుగులు తీశారని తెలిపారు. మౌమెరేలోని పెల్నీ పోర్ట్ టెర్మినల్ వద్ద వెయిటింగ్ రూమ్ కూలిపోవడాన్ని తాను చూసినట్లు చెప్పారు. స్థానిక ఆసుపత్రిలో పనిచేస్తున్న 31 ఏళ్ల లూకాస్ లోటార్ కూడా భూకంప సమయంలో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురైనట్లు తెలిపారు. అకస్మాత్తుగా భూమి కంపించడంతో ఆసుపత్రి పరిసరాల్లో ఉన్నవారు బయటకు పరుగులు తీశారని చెప్పారు. అనంతర ప్రకంపనలు కూడా ప్రజల్లో ఆందోళనను మరింత పెంచాయి. ఇండోనేసియా వాతావరణ, శీతోష్ణస్థితి, భూభౌతిక శాస్త్ర సంస్థ సునామీ ముప్పును దృష్టిలో ఉంచుకుని ప్రజలకు పలు సూచనలు చేసింది. సముద్ర తీరాలు, నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్లవద్దని, తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్లాలని సూచించింది. సునామీ హెచ్చరికలు పూర్తిగా ఉపసంహరించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అలల కొలమాన పరికరాల ద్వారా సముద్ర మట్టంలో మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# వందేమాతరం ఆలపించని కేరళ

**కేంద్రం ప్రోటోకాల్‌కు భిన్నంగా స్వాతంత్ర్య వేడుకలు**

**మహా :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేరళలో రాజకీయ వివాదానికి దారి తీశాయి. జాతీయ గేయం 'వందేమాతరం' ఆలాపనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన కొత్త ప్రోటోకాల్‌కు భిన్నంగా కేరళ ప్రభుత్వం అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించింది. శనివారం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వీడీ సతీశన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం జన గణ మన గీతాన్ని ఆలపించారు. అయితే, ఈ అధికారిక రాష్ట్ర వేడుకలో వందేమాతరం గేయాన్ని మాత్రం ఆలపించలేదు. దీంతో ఈ విషయం రాజకీయంగా చర్చనీయాంశమైంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందే కేరళ ప్రభుత్వ వైఖరిపై ఆసక్తికర పరిణామాలు నెలకొన్నాయి. కొద్ది రోజుల క్రితం, వందేమాతర గేయాన్ని పూర్తి స్థాయిలో ఆలపిస్తారా? అని ప్రశ్నించగా, అందుకు సూటిగా సమాధానం ఇవ్వడానికి సతీశన్ నిరాకరించారు. 'వేచి చూడండి' అని సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై కాంగ్రెస్, యూడీఎఫ్‌కు స్పష్టమైన వైఖరి ఉందని కూడా తెలిపారు. తీరా స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరాన్ని పక్కనబెట్టడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. కేరళ విద్యాశాఖ కూడా రాష్ట్రంలోని పాఠశాలల్లో జెండా ఎగురవేసి కేవలం 'జనగణమన' పాడాలని ఆదేశించింది తప్ప, వందేమాతరం పాడాలని ఎలాంటి సూచనలు చేయలేదు. ఈ విస్మరణ కేరళలో రాజకీయ వివాదాన్ని రేకెత్తించింది.

# పంద్రాగస్టు వేళ ప్రశంసా పత్రాల లొల్లి

**వివిధ శాఖల్లో కష్టపడిన వారికి గుర్తింపు ఏదీ?**

**వరంగల్, మహా**;స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లాలో వివిధ శాఖల ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 103 మందిని సత్కరించగా, ఇందులో దాదాపు సగం మంది పైగా పోలీసు శాఖకు చెందిన వారేనన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగుతోంది. పోలీసు సిబ్బందికి గుర్తింపు ఇవ్వడంపై అభ్యంతరం లేకపోయినా.. రెవెన్యూ, మున్సిపల్, బీఎల్‌ఓలు, అంగన్వాడీ సిబ్బంది తదితర విభాగాల్లో కష్టపడుతున్న వారికి కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇటీవల ఎస్ఐఆర్ ప్రక్రియలో రాత్రింబవళ్లు పనిచేసిన రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల విధుల్లో నిరంతరం సేవలందిస్తున్న బీఎల్‌ఓలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తల్లో ఉత్తమంగా పనిచేసిన వారిని గుర్తించి ఉంటే మరింత ప్రోత్సాహం లభించేదని ఉద్యోగులు భావిస్తున్నారు.ప్రశంసా పత్రం ఆర్థిక ప్రయోజనం ఇవ్వకపోయినా.. తమ కష్టాన్ని అధికారులు గుర్తించారనే గౌరవం ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచుతుంది. అన్ని శాఖలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

## జాతీయ జెండాకు అవమానం

**వరంగల్, బ్యూరో మహా:** దుగ్గొండి మండల కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకం తలకిందులుగా ఎగురవేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. తహసీల్దార్ ముస్క సమ్మక్క జాతీయ జెండాను ఆవిష్కరించిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.జాతీయ పతాకాన్ని ఎగురవేసే ముందు అధికారులు తగిన తనిఖీలు ఎందుకు చేయలేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. జెండాను ఎవరు సిద్ధం చేశారు, అధికారులు ముందస్తుగా పరిశీలించారా అనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.





## ప్రతి పేద కుటుంబ సంక్షేమమే లక్ష్యం

**వరంగల్, బ్యూరో మహా:** ఖిలా వరంగల్ కోటలోని ఖుష్ మహల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతు సంక్షేమంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో 9,522 నిరుపేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయగా, 2,973 ఇళ్ల నిర్మాణం పూర్తై గృహప్రవేశాలు జరిగినట్లు తెలిపారు. జిల్లాలో 29,772 కొత్త రేషన్ కార్డులు జారీ చేయగా, 93,825 మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. మహిళా సంఘాలకు రుణాలు అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా స్థానికంగా భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు రన్‌వే విస్తరణకు 253 ఎకరాల భూమిని సేకరించి ఎయిర్‌పోర్టు అథారిటీకి అప్పగించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు.వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంత్రి, కలెక్టర్ స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?

**సంగారెడ్డి, మహా :** రైతులకు ఎవరేం చేశారో అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?. పదేళ్లలో మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో చర్చిద్దాం. ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు చేయడం కాదని, ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఐదేళ్లపాటు మహిళలకు మంత్రి పదవి ఇవ్వని వారు నేడు మహిళల గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. అగ్గిపెట్టె రావు, అఘోరా రావులు వస్తారు.. జాగ్రత్త. వీళ్లకు అగ్గిపెట్టెలు దొరకవు కానీ అమాయక యువతను మాత్రం బలిచేశారు. శవాలపై పెట్టుబడులు పెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు నిలబడి ఉంటా. ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. దుర్మార్గులు, దుష్టులు మాయమాటలతో వస్తారు. యువత అప్రమత్తంగా ఉండాలి. మాయమాటలను నమ్మొద్దు అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డిలో పర్యటించిన రేవంత్ రెడ్డి.. నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణలో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో వీటిని రూపొందించినట్లు పేర్కొన్నారు. దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. పేదలకు రూ.14,800 కోట్లతో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వాళ్లు చేసిన అప్పులకు రూ.75 వేల కోట్ల వడ్డీ



కడుతున్నాం. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం' అని పేర్కొన్నారు.

**కేంద్రం చెప్పేది కనిపించడం లేదా?**

రైతులకు ఎవరేం చేశారో అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?. పదేళ్లలో మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో చర్చిద్దాం. అతి తక్కువ అప్పుల్లో తెలంగాణ రైతులు ఉన్నారని కేంద్రం చెబుతోంది. కేంద్రం చెప్పేది బీజేపీ నేతలకు కనిపించడం లేదా?. రైతులు పండించిన వడ్లకు రూ.90 వేల కోట్లు బదిలీ చేశాం. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు నొక్కారు. గతంలో పాలపిట్ట చీరలు ఇచ్చాం.. ఈసారి చిలకపచ్చ చీరలు ఇస్తాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్ అంటూ డబ్బా కొట్టారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాలేదు కానీ వారికి మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. మేము 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నాం. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరేలేదు. కొత్తగా 2.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశాం. అర్హులైన చేనేత, గీత కార్మికులందరికీ పెన్షన్లు ఇస్తాం. అని సీఎం అన్నారు.

**మేమొచ్చాకే రేషన్ కార్డులు**

'గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాకే ఇవ్వడం ప్రారంభించాం. రేషన్ విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని ఎవరూ తినేవారు కాదు.. పైగా పక్కదారి పట్టేవి. పేదల ఆకలి తీర్చేదే ఈ స్మార్ట్ రేషన్ కార్డు. అసలు రేషన్ షాపులు తెచ్చిందే కాంగ్రెస్. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలని ఇందిరమ్మ ఆలోచన చేశారు. వారికి సంక్షేమం అందించడం మా బాధ్యత. బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదు.. రెండూ ఒక్కటే. గతంలో ఆ పార్టీలు ఎప్పుడైనా సన్నబియ్యం ఇవ్వాలని ఆలోచించాయా?. రేషన్ కార్డు అనేది పేదల ఆత్మగౌరవం. వారికి ప్రతినెలా 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నాం. దీని వల్లే మార్కెట్‌లో బియ్యం ధరలు తగ్గాయి.

**వెయ్యి కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి వంటి వారు దొరకరు: ముఖ్యమంత్రి ప్రశంస**

సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. వెయ్యి కోట్ల రూపాయలు వెచ్చించినా జగ్గారెడ్డి వంటి నాయకుడు దొరకరని ఆయన వ్యాఖ్యానించారు. ఇవాళ సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని శ్రీరాముడు అనుకుంటే, జగ్గారెడ్డి ఆయనకు హనుమంతుడి వంటి వారని అభివర్ణించారు. "నాయకులకు మార్కులు వేస్తే నాకంటే జగ్గారెడ్డికే ఎక్కువ వస్తాయి. అలాంటి నాయకుడిని ఓడించడం ఈ ప్రాంత ప్రజల దురదృష్టం" అని సంగారెడ్డి ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ జగ్గారెడ్డి నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ పనిచేస్తున్నారని రేవంత్ రెడ్డి కొనియాడారు. "కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు ఆయన. ఇక్కడ పరిస్థితులు ఎలా ఉన్న, జగ్గారెడ్డి కచ్చితంగా ప్రజా జీవితంలోనే ఉండాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ఇప్పటికైనా సరిదిద్దండి.. లేదంటే ఉద్యమాలు తప్పవు

**ఇంటర్వ్యూల్లో 90 శాతం అవినీతే**

**కేంద్రప్రభుత్వానికి బాబా రాందేవ్ హెచ్చరిక**

ఢిల్లీ, మహా : దేశంలో విద్య, ప్రభుత్వ ఉద్యోగాల నియామక వ్యవస్థపై యోగా గురు బాబా రాందేవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరసనలు పెరుగుతుండటం వ్యవస్థలోని లోపాలకు సంకేతమని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పతంజలి యోగాపీఠ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళనలపై రాందేవ్ స్పందించారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేవని అన్నారు. ఉపాధ్యాయులు, పుస్తకాలు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల కొరత ఉందని చెప్పారు. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియపైనా రాందేవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇంటర్వ్యూల సమయంలోనే 90 శాతం అవినీతి జరుగుతోందని ఆరోపించారు. కులం, సామాజిక వర్గం, సమాజం, భావజాలం ఆధారంగా కొందరికి ప్రాధాన్యం లభిస్తోందని అన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు మాత్రం వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. వ్యవస్థను ఇప్పటికైనా సరిదిద్దాలని రాందేవ్ సూచించారు. ప్రజల్లో ఆగ్రహం పెరిగేలోపే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. లేదంటే దేశంలో మరిన్ని ఉద్యమాలు రావచ్చని హెచ్చరించారు. అయితే ఆందోళనల పేరుతో హింస, అరాచకాన్ని తాను సమర్థించనని స్పష్టం చేశారు




# వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌ను వికాసం నుంచి వైభవం వైపు నడిపిస్తున్నామని.. సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2047 స్వర్ణాంధ్ర సాధన సంకల్పం 5.5 కోట్ల మంది ఆంధ్రులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అమరావతి రాజధానిలో మువ్వన్నెల జెండాను ఎగురవేసిన చంద్రబాబు పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రసంగిస్తూ "మనకు స్వాతంత్ర్యం అంత తేలికగా ఒక్కరోజులో ఒక్కరి పోరాటంతో రాలేదు. దశాబ్దాల పోరాటం ఎందరో మహనీయుల బలిదానం, మరెందరో అమరవీరుల ప్రాణత్యాగం మనకు స్వాతంత్ర్యాన్ని అందించాయి. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు చూసిన స్వప్నాన్ని సాకారం చేద్దాం. 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని నెంబర్ 1 చేద్దామన్న లక్ష్యంతో పనిచేద్దాం. హక్కుల్ని, గౌరవాన్ని ఇచ్చిన దేశానికి మనమేంచేయాలన్న ఆలోచనతో పని చేద్దాం. అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి వచ్చే 20 ఏళ్లు అనునిత్యం పనిచేస్తామని సంకల్పం తీసుకోవాలి. ఈ దేశానికి మనం ఏం ఇవ్వగలం అని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. మనం ఏ పనిచేసినా దేశ భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని, సమాజహితం కోసం పనిచేయాలి. విద్యార్థి ఆవిష్కరణలతో రైతులు ప్రకృతి సాగుతో, ఉద్యోగి అంకిత భావనతో, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి. వ్యక్తిగత విజయాలన్నీ దేశ నిర్మాణంలో భాగం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్ లక్ష్యం, మనం రూపొందించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఏపీ దేశానికి బలమైన రాష్ట్రంగా ఎదగాలి. అంతా కలిసి ఐక్యంగా స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధిద్దాం. దీనికి దృఢమైన సంకల్పం చేద్దాం". అని ముఖ్యమంత్రి అన్నారు

**ప్రతిసారీ రాష్ట్రానికి సవాళ్లే**

"గత పాలనలో రాష్ట్రం ఐదేళ్ల పాటు విధ్వంసమైంది. వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. ఐదేళ్లు చీకటి రోజులు చూశాం. గత పాలకుల అహంకారం, అసమర్థత, అవినీతి, అరాచకంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనకబడింది. ఆర్థికంగా రాష్ట్రానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి అధికారంలోకి వచ్చాక పునర్నిర్మాణ బాధ్యతను తీసుకున్నాం. గడచిన రెండేళ్లలో ఏపీని నిలబెట్టాం. తొలి సంతకం నుంచే సంక్షేమానికి, అభివృద్ధికి, సుపరిపాలనకు అసలైన అర్థం చెప్పాం. 26 నెలల్లోనే ప్రజలకు మార్పు కనిపించేలా చేశాం. విధ్వంసం నుంచి వికాసం వైపు... సంక్షోభం నుంచి స్థిరత్వం వైపు... అనిశ్చితి నుంచి ఆత్మవిశ్వాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ ఇదే మన లక్ష్యం. దీనికోసం 10 సూత్రాలు రూపొందించుకున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణ మా ప్రభుత్వ విధానం. అన్నిప్రాంతాల అభివృద్ధి, అన్నివర్గాల సాధికారత లక్ష్యంగా పనిచేస్తున్నాం. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణ చేపట్టాం. ప్రజల మద్దతు, కూటమి ఐక్యత, కేంద్ర ప్రభుత్వ సహకారం, ఈ మూడు రాష్ట్రానికి కొత్త ఊపిరి పోశాయి. పోలవరం, అమరావతి విశాఖ స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్, అంతర్జాతీయ పెట్టుబడులు ఇలా అన్నింటిలోనూ కేంద్రం సహకారం అందిస్తోంది. అన్ని వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడంతో నేడు వృద్ధి రేటు 11.3 శాతానికి పెరిగింది. రాష్ట్రానికి గుదిబండగా మారిన గత పాలకులు చేసిన అప్పులను రీషెడ్యూలు చేసి 370 రుణాలపై వడ్డీభారం తగ్గించ గలిగాం. ఇప్పటి వరకు రూ.8,269 కోట్లు ఆదా అయ్యేలా చర్యలు చేపట్టాం. 26 నెలల్లో రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమానికి రూ.1.34 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశాం. పేదల జీవన ప్రమాణాల్ని పెంచేందుకు పీ4 కార్యక్రమం చేపట్టాం. యువత గ్లోబల్ లీడర్లుగా ఎదగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. మెగా డీఎస్సీకి అడ్డంకులు సృష్టించినా 15,941 ఉద్యోగాలు భర్తీ చేశాం. ఇకపై ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేస్తాం. ఇప్పటికే 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. యువత ప్రతిభకు ఆకాశమే హద్దు వారి ఆవిష్కరణలకు ప్రపంచం జై కొట్టాలి." అని సీఎం అన్నారు



**రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ**

పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చామని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, వీటిలో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని తద్వారా 11 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. ఒక ఏడాదిలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి రావడం మనపై నమ్మకాన్ని పెంచిందని, రెండేళ్లలో ఎఫ్‌డిఐ ఆరున్నర రెట్లు పెరిగిందని తెలిపారు. గూగుల్ ఏఐ డాటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జెఎస్ డబ్ల్యు స్టీల్, దాల్మియా సిమెంట్, ఎఎం గ్రీన్ అమోనియా, హీరో, రాయల్ ఎన్ ఫీల్డ్, స్వర్ణగిరి గోల్డ్ మైన్ వంటి అనేక ప్రాజెక్టులు వచ్చాయి..95 వేల కోట్ల విలువైన బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టు పట్టాలెక్కుతోందని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు దీని కోసం అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఇప్పటికే 138 పార్కులకు శ్రీకారం చుట్టామని, సమాజంలో ప్రతీ వర్గానికి న్యాయం జరిగేలా చూస్తున్నామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నామని, నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవితకు పునాదులు వేస్తున్నామన్నారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంతో సంజీవని తీసుకువచ్చాం. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుంది. సీఎం సహాయ నిధి ద్వారా ఇప్పటి వరకూ రూ.1,631 కోట్లు వ్యయం చేసి పేదల్ని ఆదుకున్నాం. అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతుకూ 20 వేలు అందిస్తున్నాం. పొగాకు, కోకూ, మామిడి రైతులను మద్దతు ధరతో ఆదుకున్నాం. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీతో సహకారం అందిస్తున్నాం. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేస్తున్నాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుడతాం. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తాం. ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేసేలా చెరువులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే అందిస్తున్నామని వివరించారు.

**అభివృద్ధి పథం వైపు ఏపీ**

3Tరాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనేదే చమ ప్రభుత్వ లక్ష్యమని, 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ.25 వేల కోట్లు ఖర్చు చేయడం జరిగిందని చెప్పారు. రానున్న మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామన్నారు. వంశధార-నాగావళి నదుల అనుసంధానం 73 శాతం పూర్తి చేశామని, నేరడి ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని ముందుకు తీసుకు వెళ్తున్నాం. అనకాపల్లికి త్వరలో గోదావరి జలాలు తెస్తాం. పోలవరం ప్రాజెక్టులో 89 శాతం పనులు పూర్తి చేశాం. వచ్చే ఏడాది పుష్కరాలకు ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలో ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్నదే మా లక్ష్యం. రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడుపుతున్నాం. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను శరవేగంగా నిర్మిస్తున్నామన్నారు. జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం ఉప్పాడలో ఆధునిక ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తున్నామని, ఉత్తరాంధ్రలో అల్లూరి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల రైల్వే పనులు..రూ.38 వేల కోట్ల హైవే పనులు జరుగుతున్నాయి. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హార్బర్లు, హైవేలు, రైల్వే లేన్లతో రాష్ట్రం లాజిస్టిక్స్ కు హబ్ అవుతుంది. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా రాజధాని అమరావతి నిర్మాణం చేపట్టాం. బ్లూ గ్రీన్ సిటీగా డీప్ టెక్ క్యాపిటల్ గా, కార్బన్ న్యూట్రల్, నో పోల్ సిటీగా అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిర్మితం అవుతుంది. స్థానిక పాలనలో ఏపీ దేశానికే ఆదర్శం. పల్లెపండుగ, అడవి తల్లి బాట కింద గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టాం. ఏపీని 50 శాతం గ్రీన్ కవర్ తెచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం. చెత్తపన్ను రద్దు చేసి లెగసీ వేస్ట్ తొలగించాం. స్వచ్ఛరథం వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టాం. విద్యుత్ రంగంలోనూ వెలుగులు తెచ్చాం. ట్రూ డౌన్ చేసి ట్రూ అప్ భారాన్ని భరిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో 112 గిగావాట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం." అని సీఎం వెల్లడించారు.

**ప్రజలే ఫస్ట్ విధానం**

"మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వటం ద్వారా పెట్టుబడులు సాధిస్తున్నామని, రెండేళ్లలో రూ.19,390 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. బీచ్ టూరిజం, టెంపుల్, హోమ్ స్టేలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు పాలన దగ్గర చేసేందుకు మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అన్నమయ్య జిల్లాకు మదనపల్లెను కేంద్రంగా మార్చామన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.30,849 కోట్ల బకాయిలు చెల్లించామన్నారు. ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం జరిగిందని, విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానం అనుసరిస్తున్నామన్నారు. అంతకు ముందు ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళాలు, ఎన్సీసీ, స్కౌట్స్ విద్యార్థుల కవాతు నిర్వహించి సీఎం కు గౌరవ వందనం సమర్పించాయి. వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచాయి.

# 89 మిల్లుల్లో రూ.927 కోట్ల ధాన్యం మాయం

( మొదటి పేజీ తరువాయి )

అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యంగా తిరిగి అప్పగించాల్సి ఉండగా..కొంతమంది మిల్లర్లు దానిని పక్కదారి పట్టించినట్లు ప్రాథమికంగా తేలింది. విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ డీఎస్ చౌహాన్ నేతృత్వంలో జులై 21వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ధాన్యంలో ప్రతి గింజను తిరిగి రాబట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించడంతో అధికారులు రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 3 వారాల వ్యవధిలోనే భారీ మొత్తంలో అక్రమాలు గుర్తించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ తనిఖీల్లో మొత్తం 3,72,693.23 టన్నుల ధాన్యం లోటు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. ఇందులో కస్టమ్ మిల్లింగ్ రైస్‌కు సంబంధించిన ధాన్యం లోటు 1,84,669.88 టన్నులు కాగా..వేలం ధాన్యం లోటు 1,88,023.35 టన్నులుగా నమోదైంది. 202223 యాసంగి నుంచి 2025 26 వానకాలం వరకు వివిధ సీజన్లకు సంబంధించిన ధాన్యం, ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం పక్కదారి పట్టినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 28 క్రిమినల్ కేసులు నమోదు చేసి 50 మందిని నిందితులుగా చేర్చారు. 26 మంది మిల్లర్లను అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. స్పందించని మిల్లర్లపై కేసులు, అరెస్టులతో చర్యలు వేగవంతం చేశారు. ఇప్పటివరకు సుమారు రూ.715 కోట్ల విలువైన ధాన్యాన్ని రికవరీ చేసినట్లు సమాచారం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేటలో అక్రమాలు అత్యధికంగా ఉన్నట్లు వెల్లడైంది. అక్కడ 14 మిల్లుల్లో 1,29,867.36 టన్నుల ధాన్యం, సుమారు రూ.318.63 కోట్ల విలువైన అక్రమాలు గుర్తించారు. నిజామాబాద్‌లో 8 మిల్లుల్లో రూ.155.18 కోట్ల విలువైన 52,418.72 టన్నులు, జగిత్యాలలో 7 మిల్లుల్లో రూ.135.48 కోట్ల విలువైన 56,319 టన్నుల ధాన్యం లోటును గుర్తించారు. వనపర్తి, ఖమ్మం జిల్లాల్లోనూ భారీగా తేడాలు బయటపడ్డాయి.

# కారేపల్లిలోఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కారేపల్లి, మహ :** కారేపల్లిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పద్మ, ఎంఆర్సీలో ఎంఈవో దుగ్గిరాల జయరాజు జెండాను ఎగరేశారు. కారేపల్లి సొసైటీ కార్యాలయంలో సీనియర్ డైరక్టర్ అడ్డగోడ ఐలయ్య. పోలీస్ స్టేషన్లో ఎస్సై బైరు గోపి, కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీసౌజన్య, మోడల్ స్కూల్ లో ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్ లు జాతీయ జెండాను ఎగరవేశారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అటో యూనియన్, వర్తకసంఘం ఆధ్వర్యంలో జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు

# యువత ప్రతిభకు మిషన్ వాక్ ప్రోత్సహం

- **కొత్తతండాలో మిషన్ వాక్ స్కిల్ డెవలఫ్ మెంట్ సెంటర్ ప్రారంభం**

**కారేపల్లి, మహ:**గ్రామీణ ప్రాంత యువత ప్రతిభకు ప్రోత్సహం అందిస్తూ వారి భవిష్యత్తు తీర్చిదిద్దటమే మిషన్ వాక్ స్కిల్ డెవలప్‌మెంట్ పని చేస్తుందని ప్రముఖ ఫిజియోథెరపిస్ట్, వైద్యుడు డాక్టర్ బాదావత్ రవి అన్నారు. సింగరేణి మండలం డాక్టర్ రవి స్వగ్రామం కొత్తతండాలో యువతకు ఉపాధి, పేదలు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు మిషన్ వాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాదావత్ రవి మాట్లాడుతూ యువతకు నైపుణ్య శిక్షణ అందించి,ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మార్గం చూపాలనే సంకల్పంతో స్వంత గ్రామంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యువతకు సరైన దిశానిర్దేశం చేసి నైపుణ్యాలను అందిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచే ఎంతోమంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారన్నారు. గ్రామీణ యువతలో ప్రతిభ, ఉత్సాహం ఉన్నప్పటికీ సరైన శిక్షణ,మార్గదర్శకత్వం లేక ఆర్థిక పరిస్థితుల కారణంగా అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నర ని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాలు అత్యంత అవసరమన్నారు. గ్రామీణ యువత ఉద్యోగ, ఉపాధి కోసం పట్టణాల వైపు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు అవకాశాలు మన దగ్గరకే రావాలంటే నైపుణ్యం ఉండాలని ఆ ఆలోచనతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు చెప్పారు. మిషన్ వాక్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ బాధితులు, దివ్యాంగులు,పేద కుటుంబాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. గ్రామ సేవా యాత్ర ద్వారా మిషన్ వాక్ సేవలను విస్తృత పర్చినట్లు తెలిపారు.



# మహాత్మా గాంధీ విగ్రహం ఆవిష్కరణ

**ఆలేరు ఆగస్టు 15 మహా** : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ఆర్యవైశ్య భవనం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ చేశారు ఈరోజు శుభదినం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అలాగే దేశ స్వాతంత్రం కోసం మన మహాత్మా గాంధీ ఎన్నో ఉద్యమాలు చేసి ప్రాణ త్యాగం చేయడం జరిగిందని అందుకు ఫలితంగానే మనకు దేశానికి స్వాతంత్రం రావడం జరిగిందని మహాత్మా గాంధీ ఆశయాలను సాధించుట కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా ముఖ్య అతిథులు పిలుపు ఇచ్చారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి విగ్రహ ఆవిష్కరణ కర్త రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బెజగం సంతోష్, మరియు ఆలేరు పట్టణ మున్సిపల్ చైర్మన్ బాలామణి భాస్కర్, సింగిల్ విండో చైర్మన్ జనగామ ఉపేందర్ రెడ్డి,ఆర్యవైశ్య సంఘం ఆలేరు పట్టణ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నాగ బండి మధు, రాష్ట్ర కమిటీ సభ్యులు పసుపునూరి వీరేశం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల సత్యం, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వంగపల్లి అంజయ్య స్వామి, వైశ్య సంఘం నాయకులు సిహెచ్ ప్రకాష్, గంప కృష్ణ,బి కాశీనాథ్, గార్లపాటి శ్రీనివాస్, జిల్లా శ్రీను,కామిటికారి కృష్ణ, బడుగు జాంగిర్, ఎండి గుప్త రెడ్డి,ఇక్బాల్, మొరిగాడి రమేష్,గొట్టిపాముల రాజు, వార్డు కౌన్సిలర్లు బీజన కళ్యాణి,యాట శివ, పాసికంటి సంపత్, వానరాశి మరియమ్మ, పాకాల మౌనిక, గుప్త సమంత రెడ్డి, జట్ట సిద్దులు, బీజన మధు తదితరులు పాల్గొన్నారు.

# వలిగొండలో వాహన తనిఖీలు.. 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**వలిగొండ, ఆగస్టు 15 మహా న్యూస్ :** వలిగొండ మండల కేంద్రంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.అదేవిధంగా హెల్మెట్, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులకు జరిమానాలు విధించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, వాహనానికి ఇన్సూరెన్స్, నంబర్ ప్లేట్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన




చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ

( మొదటి పేజీ తరువాయి )

రూ. 36వేల కోట్లు రైతులకు అందించినట్లు తెలిపారు. మొత్తంగా రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ సరికొత్త రికార్డులను అధిగమిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగానికి సాగునీరు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సీఎం తెలిపారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి రైతులకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగంతోపాటు నివాస గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. విద్యుత్, సాగునీరు, రైతు పెట్టుబడి సాయం వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా ఉన్నాయని వివరించారు. మహిళలు, ఆడబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను కూడా సీఎం ప్రస్తావించారు. కల్యాణలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందించినట్లు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డలను భవిష్యత్తులో వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉపాధి, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి వర్గాన్ని భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేసింది. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా సమాన అవకాశాలు, అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందేలా పాలన సాగించడమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం



అధికారం చేపట్టిన 32 నెలల్లో దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతూ సంక్షేమాన్ని విస్తరించామన్నారు. తమ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని సీఎం స్పష్టం చేశారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం మన స్వాతంత్ర్య పోరాటమని అభివర్ణించారు. అహింసతో విజయాన్ని సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని తెలిపారు. ఈ క్రమంలోనే పేదవాడి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా ఉందన్న రేవంత్ రెడ్డి, వారికి ఆత్మగౌరవంతో కూడిన జీవన విధానాన్ని అందించే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఓట్ల కోసమో, మొక్కుబడి హామీలుగానో సంక్షేమాన్ని చూడటం లేదన్న సీఎం, ప్రతి పథకంలో శాస్త్రీయ దృక్పథం ఉందని వెల్లడించారు.

**నీళ్ల విషయంలో రాజీపడేదే లేదు**

రాష్ట్ర నీటి హక్కుల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామని, త్వరలోనే పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందించనున్నామని తెలిపారు. వ్యవసాయంతో పాటు నివాసాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని గుర్తు చేశారు. తెలంగాణ ఆడబిడ్డలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. "దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో కులగణన పూర్తయ్యింది. తెలంగాణను ఆదర్శంగా తీసుకుని కేంద్రం కూడా కులగణన చేపట్టింది. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేర్చింది. దేశంలోనే తొలిసారిగా గిగ్ కార్మికుల సంక్షేమం కోసం చట్టం చేశాం. సినీ కార్మికుల సంక్షేమం కోసం కూడా త్వరలో బోర్డు ఏర్పాటు చేస్తాం" అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ఉక్కు సంకల్పంతో ఉన్నామని, మహిళలను ఆర్టీసీ అద్దె బస్సులకు యజమానులుగా చేశామని గుర్తు చేశారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశామని తెలిపారు. పేదల ఆత్మగౌరవం నిలబెట్టేలా ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, రెండో విడతలో 5.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ ఏడాది పట్టణ ప్రాంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని వెల్లడించారు. కొత్తగా 2.50 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు.

**విద్యాసూచీలో ముందుకు**

విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇస్తున్నాయని, విద్యా సూచీలో 21వ స్థానంలో ఉన్న తెలంగాణ 14కు చేరుకుందని, నియోజకవర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామని, వందకు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మించే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహించామని గుర్తు చేశారు. త్వరలో జరిగే ఖేలో ఇండియా పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తుందని, విద్య, వైద్యం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశాలని చెప్పారు. ఇప్పటికే ఉస్మానియా కొత్త ఆస్పత్రి నిర్మాణంలో ఉందని, 8 కొత్త మెడికల్ కాలేజీలకు భవనాలు నిర్మిస్తున్నామని వెల్లడించారు.

**ఆన్‌లైన్ విధానంలో ప్రజావాణి**

ఈ నెల 17 నుంచి అన్ని మండలాల్లో ప్రజావాణి నిర్వహిస్తామన్న సీఎం, ప్రతి సోమవారం అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి ఉంటుందని తెలిపారు. త్వరలోనే ఆన్‌లైన్ విధానంలో ప్రజావాణి నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఎక్కడి నుంచైనా ఫిర్యాదులు, దరఖాస్తులు ఇవ్వొచ్చని తెలిపారు. చెరువులు, ప్రభుత్వ భూములు రక్షించేందుకే హైడ్రా ఏర్పాటు చేశామని, చెరువులను ప్రక్షాళన చేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. పరిశ్రమలు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, టీఎస్ ఐపాస్ ద్వారా రూ.1.95 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. మరో 78 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్ జీసీసీలు ఏర్పాటు చేస్తున్నాయని, హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 355కు పైగా జీసీసీలు పని చేస్తున్నాయని, గత 6 నెలల్లోనే హైదరాబాద్‌లో 40 జీసీసీలు ఏర్పాటయ్యాయని వివరించారు. అమెజాన్ సంస్థ రాష్ట్రంలో 7 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతోందని స్పష్టం చేశారు.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అందాలి

( మొదటి పేజీ తరువాయి )

పరిష్కరించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. వారి నాయకత్వం ప్రజలకు సాధికారత కల్పిస్తోందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో పార్లమెంటులో 'నారీ శక్తి వందన అధినియమ్'ను ఆమోదించినట్లు ప్రధాని గుర్తుచేశారు. అయితే మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రయత్నం గత 40 ఏళ్లుగా ఏదో ఒక కారణంతో రాజకీయ వివాదాలకు బలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

'నారీ శక్తి వందన్ అధినియమ్2023' అమలు ప్రక్రియ ముందుకు సాగలేదని, ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లుకు రాజ్యాంగపరంగా అవసరమైన 'సభకు హాజరై, ఓటు వేసిన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ' లభించకపోవడంతో ఆ బిల్లు వీగిపోయిందని దగుర్తు చేసారు. ఈ బిల్లు శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టడాన్ని ప్రతిపాదించిందని ప్రధాని పేర్కొన్నారు.

**దేశవ్యాప్త ప్రతిభాన్వేషణ**

2036 ఒలింపిక్స్ కోసం 515 ఏళ్ల వయస్సు గల పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు దేశవ్యాప్త ప్రతిభాన్వేషణను కూడా ఆయన ప్రకటించారు. కరోనాను జయించిన తర్వాత, ప్రతిచోటా సంఘర్షణ, యుద్ధం నెలకొన్నాయని ప్రధాని మోదీ చెబుతూ "ప్రజలు భయాందోళనలు సృష్టించడం మొదలు పెట్టారు. వ్యాక్సిన్లు ఉండవని, ఎవరూ ప్రాణాలతో బయటపడరని చాలామంది అన్నారు. ఎవరికీ ఇంధనం, డీజిల్, ఎరువులు అందవని చెప్పారు; ప్రజలు అన్ని రకాల పుకార్లను వ్యాప్తి చేశారు,. కొంతమంది ఈ భయాందోళనలను సృష్టించడంలో ఆనందం పొందారు" అంటూ విమర్శించారు. అయితే, "ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, మేము 'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తిని అనుసరించాము, మా సన్నాహాలు మాకు సహాయపడ్డాయి," అని ఆయన పేర్కొన్నారు. 'ఆత్మనిర్భరత' లేదా స్వయం సమృద్ధి భావనపై దృష్టి సారిస్తూ "భారత్ ఇతరులపై ఆధారపడకూడదనే దృఢ నిశ్చయం మాకు ఉంది, మనం స్వయం సమృద్ధిని సాధించాలి. మన దేశంలోనే అన్నీ లభిస్తాయి. కాబట్టి, మనం మనల్ని మనం మెరుగుపరచుకుని, రక్షించుకోవాలి. అలాగే స్వదేశీ, స్వయం సమృద్ధి, 'వోకల్ ఫర్ లోకల్' (స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యత) కోసం సంకల్పం తీసుకోవాలి." అని పిలుపునిచ్చారు. ముడి చమురు విషయంలో భారతదేశం ఇతర దేశాలపై ఆధారపడటం గురించి ప్రధాని మాట్లాడుతూ: "గతంలో మన సొంత ప్రాంతాల్లో అన్వేషణ జరపకూడదని నిర్ణయించుకోవడం వల్ల, మన తీరప్రాంతంలో 99% భాగం 'నోగో ఏరియా' (ప్రవేశం లేని ప్రాంతం)గా ఉండేది. ఇది గతంలో ఆలోచనా విధానంలో ఉన్న లోపం. మేము దీనిని మార్చి, ఆ ప్రాంతాన్ని అన్వేషణకు అందుబాటులోకి తెచ్చాము. కొత్త చమురు నిల్వలను కనుగొనేందుకు సముద్రంలో అన్వేషణ సాగిస్తున్నాము" అని వివరించారు.

**అనేక సవాళ్లు ఎదుర్కొన్నాం**

గత కొన్నేళ్లుగా దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందని ప్రధాని మోదీ అన్నారు. కోవిడ్19 మహమ్మారి తర్వాత ఉక్రెయిన్, పశ్చిమాసియాలో యుద్ధాలు చెలరేగాయని, ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. "గత 21 ఏళ్లలో మనం ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొన్నాం. కోవిడ్ నుంచి బయటపడిన వెంటనే ఉక్రెయిన్, పశ్చిమాసియా నుంచి యుద్ధాలు చెలరేగుతున్నాయన్న వార్తలు వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భవిష్యవాదులు ఎలాంటి అంచనాలు వేశారో దేవుడికే తెలియాలి" అని మోదీ వ్యాఖ్యానించారు. అయితే ఇలాంటి సంక్షోభాల మధ్య కూడా ప్రజా కేంద్రిత విధానాలతో దేశం ముందుకు సాగిందని ప్రధాని తెలిపారు. ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సంక్షోభాలను అధిగమించడంలో సహాయపడ్డాయని చెప్పారు. ఇదిలా ఉండగా దేశంలో మావోయిస్ట్ తీవ్రవాదం అంతిమ దశకు చేరుకుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నక్సలిజం వల్ల ఎంతోమంది యువత భవిష్యత్తు నాశనమైందని పేర్కొన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు దేశాన్ని నక్సల్స్ నుంచి విముక్తి చేస్తామని ప్రతిజ్ఞ చేశామని, ఇప్పుడు అనేక ప్రాంతాలు నక్సల్స్ నుంచి విముక్తి పొంది అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. అయితే సాయుధ నక్సల్స్‌ను ఎదుర్కోవడంలో విజయం సాధించినప్పటికీ, అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న 'ఇంటెలెక్చువల్ నక్సల్స్'ను గుర్తించి, వారిని వేరు చేయాలని పిలుపునిచ్చారు.

**ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటపడాలి**

ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి నుంచి భారత్ బయటపడాలని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా', 'స్వదేశీ', 'లోకల్ ఫర్ లోకల్' కార్యక్రమాలకు ప్రజలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశ అవసరాలను దేశీయంగానే తీర్చుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంపూర్ణ జాతీయ అభివృద్ధి, స్వావలంబనను సాధించడానికి ఉద్దేశించిన సప్తధార (ఏడు ప్రవాహాలు) దార్శనికతను వివరించారు. అవి తయారీ రంగంలో శ్రేష్ఠత (ఖర్చు, నాణ్యత మరియు స్థాయి), వ్యవసాయం/ఆహార శుద్ధి, సాంకేతిక ఆవిష్కరణలు, గతిశక్తి అనుసంధానం, రక్షణ రంగంలో స్వావలంబన, హరిత, నీలి ఆర్థిక వ్యవస్థల దిశగా ప్రోత్సాహం, ప్రపంచ మృదుశక్తి (యోగా, ఆరోగ్య సంరక్షణ, పర్యాటకం మరియు సృజనాత్మక కళలు). ఈ సంస్కరణలలో యువత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన చెప్పారు.

**పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో కోటి మంది యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ప్రధాని వెల్లడించారు. అలాగే వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కోచింగ్ కోసం కుటుంబాలు ఖర్చు చేస్తున్న వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. దేశంలో అందుబాటులో ఉన్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, నిపుణుల సేవలను ఒకే వేదికపైకి తీసుకొస్తామని తెలిపారు. వీటి సమన్వయంతో యువతకు వివిధ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించే సంపూర్ణ ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఖరీదైన కోచింగ్ సంస్థలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని భావిస్తున్నారు. సెమీకండక్టర్ రంగంలో స్వావలంబన సాధించేందుకు భారత్ కీలక అడుగులు వేస్తోందని చెప్పారు. ఇప్పటికే మూడు సెమీకండక్టర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. దేశ ఇంధన భద్రతకు అణుశక్తి కీలకమని ప్రధాని పేర్కొంటూ 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఈ దశాబ్దంలో ఐదు కొత్త అణు రియాక్టర్లను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

**జాతపితకు పుష్పాంజలి**

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తొలుత రాజ్ ఘాట్ వద్ద జాతిపిత మహాత్మా గాంధీకి ప్రధాని మోదీ పుష్పాంజలి ఘటించారు. అలాగే, ఆయన దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. 2026 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు 'వందేమాతరం' గీతానికి సంబంధించిన 150వ వార్షికోత్సవానికి కూడా గుర్తుగా నిలుస్తాయి. దేశవ్యాప్తంగా 'వందేమాతరం' నినాదం మార్మోగుతోందని, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోందని మోదీ తెలిపారు.

# మినిస్టర్ జగ్గారెడ్డి? సీఎం కొత్త వ్యూహం

**హైదరాబాద్, మహా :** సంగారెడ్డి రాబిన్ హుడ్‌గా ప్రజలతో మమేకమై నిరంతరం పనిచేసే జగ్గారెడ్డికి త్వరలో అనూహ్యపదవి దక్కే అవకాశాలు కనబడుతున్నాయి. తాజాగా రాజగోపాల్ రెడ్డి స్వరం పెంచడం, మెదక్ జిల్లాలో హరీష్ ను ధీటుగా ఎదుర్కొనేందుకు జగ్గారెడ్డి మాస్ అప్పీల్ పనిచేస్తుందని భావిస్తుండడంతో ఒక్క నియామకంతో ఇటు జగ్గారెడ్డితో పార్టీకి ఊపు, అటు రాజగోపాల్ రెడ్డికి చెక్ పెట్టబోతున్నట్లు సిగ్నల్స్ పంపారన్న చర్చ జరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లా నుండి ప్రస్తుతం దామోదర రాజనర్సింహ మంత్రిగా ఉండగా, మాజీ మంత్రి హరీష్ రావుకు కౌంటర్లు ఇవ్వడంలో విఫలమవుతున్నారన్న చర్చ ఉంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హరీష్ రావుకు సొంత జిల్లాలోనే చెక్ పెట్టేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారని, త్వరలో ఎమ్మెల్సీని చేసి అక్టోబర్ లేదా నవంబర్ లో మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. జగ్గారెడ్డి కేబినెట్ లోకి వస్తే రాజకీయ పరిణామాలు మారిపోనున్నాయి.

# పవన్ కల్యాణ్‌కు తీవ్ర జ్వరం

కాకినాడ నుండి నేరుగా హైదరాబాద్ కు

అమరావతి, మహా : ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అనారోగ్యానికి గురయ్యారు. తీవ్ర జ్వరంతో ఆయన బాధపడుతున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం విజయవాడ లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ నిర్వహించిన 'ఎట్ హోమ్' కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం వేళ శనివారం ఉదయం కాకినాడలో నిర్వహించిన 80వ పంద్రాగస్టు వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్ పాల్గొన్నారు. అనంతరం రాజమహేంద్రవరంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్‌ను పవన్ ప్రారంభించారు. ఈ సమయంలో జ్వరం తీవ్రం కావడంతో కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేయడంతో ఉపముఖ్యమంత్రికి కొంత ఉపశమనం కలిగింది. అనంతరం ఆయన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

# పేదల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

హనుమకొండ, మహా: పేదల కడుపు నింపడం, ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవంతో సొంతింటి కల సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. పేదల కోసం సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, విద్య వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.రాష్ట్రంలో ఇప్పటికే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల్లో క్యూఆర్ కోడ్ ఉండటంతో పరిసర ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లోనూ సరుకులు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.వరంగల్ అభివృద్ధికి సుమారు రూ.5,700 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



### కుటుంబంతో విహారయాత్రలో

# శ్రియా శరణ్

టాలీవుడ్‌తో పాటు దక్షిణాది, బాలీవుడ్ చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రియా శరణ్ మరోసారి అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో భర్త ఆండ్రే కోశ్చీవ్, కుమార్తె రాధాతో కలిసి విహారయాత్రను ఆస్వాదిస్తున్న ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ చిత్రాలు ప్రస్తుతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ఫొటోల్లో శ్రియా శరణ్ ఎంతో సింపుల్‌గా, అందంగా కనిపించారు. పౌడర్ బ్లూ రంగు డ్రెస్‌తో పాటు బ్లాక్ బూట్స్ ధరించి సహజమైన లుక్‌లో మెరిశారు. ఎలాంటి హంగామా లేకుండా సింపుల్ స్టైలింగ్‌తో కనిపించిన ఆమె చిరునవ్వు ఫొటోలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. కుటుంబంతో కలిసి గడుపుతున్న ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నట్లు ఆమె ఫొటోలు స్పష్టం చేస్తున్నాయి.ఒక ఫొటోలో శ్రియా తన భర్త ఆండ్రేతో కలిసి కుమార్తె రాధాతో సంతోషంగా పోజిచ్చారు. చిన్నారి రాధా తన బొమ్మను చేతిలో పట్టుకుని తల్లిదండ్రుల మధ్య నిల్చుంది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని అందమైన నిర్మాణాల నేపథ్యంలో తీసిన ఈ ఫొటోల్లో భారీ స్తంభాలు, ప్రశాంతమైన వాతావరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ అనుబంధాన్ని ప్రతిబింబించే ఈ చిత్రాలు అభిమానులకు ఎంతో నచ్చుతున్నాయి.సినీ కెరీర్‌తో పాటు కుటుంబ జీవితానికి కూడా శ్రియా సమాన ప్రాధాన్యం ఇస్తుంటారు. సినిమాల షూటింగులతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ భర్త, కుమార్తె కోసం సమయం కేటాయిస్తుంటారు. తరచూ కుటుంబంతో కలిసి విహారయాత్రలకు వెళ్తూ ఆ మధుర జ్ఞాపకాలను అభిమానులతో పంచుకుంటుంటారు. తాజా ఫొటోలు కూడా ఆమె వ్యక్తిగత జీవితంలోని ఆనందకరమైన క్షణాలను చూపిస్తున్నాయి.శ్రియా శరణ్ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలువురు అగ్ర కథానాయకులతో కలిసి నటించారు. ప్రభాస్, మహేశ్‌బాబు, రజనీకాంత్ వంటి ప్రముఖ నటులతో కలిసి తెరపై కనిపించారు. విభిన్న పాత్రల్లో తన నటనతో పాటు అందం, సహజమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమానాన్ని సంపాదించుకున్నారు.పరిశ్రమలోకి వచ్చి ఎన్నో సంవత్సరాలు గడిచినా శ్రియా ఇప్పటికీ సినిమాల్లో చురుకుగా కొనసాగుతున్నారు. వయసుకు తగ్గ పాత్రలను మాత్రమే కాకుండా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం హిందీ చిత్రాలతో పాటు ఆసక్తికరమైన ప్రాజెక్టుల్లో భాగమవుతూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.



# త్రివిక్రమ్ బాటలో ఇద్దరు

తెలుగు సినీ పరిశ్రమలో ప్రస్తుతం ఇద్దరు యువ దర్శకుల పేర్లు ఆసక్తికరంగా వినిపిస్తున్నాయి. 'మాటల మాంత్రికుడు' త్రివిక్రమ్ శ్రీనివాస్ తరహాలో కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే క్లీన్ ఎంటర్‌టైనర్లను రూపొందిస్తూ వెంకీ అట్లూరి, వెంకీ కుడుముల ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. హద్దులు దాటని హాస్యం, హుందాతనంతో కూడిన సంభాషణలు, భావోద్వేగాలు, రొమాన్స్‌ను సమపాళ్లలో కలిపి సినిమాలను తెరకెక్కించడం వీరి ప్రత్యేకతగా మారింది. ఇద్దరి పేర్లలోనూ 'వెంకీ' ఉండటం ఒక విశేషమైతే.. త్రివిక్రమ్ శైలిని తమదైన పద్ధతిలో కొనసాగించడం మరో ఆసక్తికరమైన అంశం. గతంలో ప్రముఖ దర్శకుల శైలిని అనుసరించేందుకు ప్రయత్నించిన పలువురు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. అయితే ఈ ఇద్దరు దర్శకులు మాత్రం తమ సొంత కథనం, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను మెప్పిస్తూ ముందుకు సాగుతున్నారు.వెంకీ కుడుముల విషయానికి వస్తే.. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన 'అ ఆ' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవం ఆయన సినిమాలపై ప్రభావం చూపినట్లు కనిపిస్తుంది. 'ఛలో'తో దర్శకుడిగా పరిచయమై మంచి విజయాన్ని అందుకున్న ఆయన.. 'భీష్మ'తో మరోసారి తన కామెడీ మార్క్‌ను చూపించారు. వ్యవసాయానికి సంబంధించిన అంశాన్ని వినోదాత్మకంగా చెప్పిన ఈ చిత్రం కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'రాబిన్‌హుడ్' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, ఆయన దర్శకత్వ శైలి, కామెడీ టైమింగ్‌కు ప్రశంసలు దక్కాయి.ఇక వెంకీ అట్లూరి సినీ ప్రయాణం కూడా విభిన్నంగా సాగింది. నటుడిగా, రచయితగా కెరీర్ ప్రారంభించిన ఆయన 'తొలిప్రేమ'తో దర్శకుడిగా మారారు. అనంతరం 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాలతో తన కథా ఎంపికలో పరిణతిని చాటుకున్నారు. కుటుంబ బంధాలు, మానవ



సంబంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇస్తూ కథను నడిపించడం ఆయన శైలిలో ప్రధానంగా కనిపిస్తుంది. ముఖ్యంగా అర్థవంతమైన సంభాషణలు, భావోద్వేగ సన్నివేశాలతో కుటుంబ ప్రేక్షకులకు దగ్గరవుతున్నారు.త్రివిక్రమ్ సినిమాల్లో కనిపించే కుటుంబ విలువలు, చక్కటి సంభాషణలు, హాస్యాన్ని ఈ ఇద్దరు దర్శకులు తమదైన శైలిలో ఉపయోగిస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే వీరు కేవలం అనుకరణకే పరిమితం కాకుండా తమ కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ ద్వారా ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నారు. కుటుంబ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే క్లీన్ ఎంటర్‌టైనర్లకు ఎప్పటికీ ఆదరణ ఉంటుంది. ఈ నేపథ్యంలో వెంకీ అట్లూరి, వెంకీ కుడుముల తమ శైలిని మరింత పదును పెట్టుకుంటూ ముందుకు సాగితే.. భవిష్యత్‌లో టాలీవుడ్‌లో మరింత బలమైన స్థానాన్ని సంపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# దసరా కానుకగా బా బా బ్లాక్ షీప్

సచిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై వేణు దోనేపూడి నిర్మాణంలో, గుణి మంచికంటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ చిత్రం 'బా బా బ్లాక్ షీప్'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో రూపొందుతున్న ఈ సినిమా నుంచి తొలి లిరికల్ సాంగ్ 'ఆజా మేరీ జాని'ని రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ విడుదల చేశారు. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 9న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.అక్షయ్ లగుసాని, విష్ణు ఓయ్‌లపై కలర్‌ఫుల్‌గా తెరకెక్కించిన 'ఆజా మేరీ జాని' పాట యూత్‌ను ఆకట్టుకునేలా ఉంది. ఎలక్ట్రానిక్ కిలి, ఆనంద్ (ఆర్కాడొ) సంగీతం అందించగా, కిట్టు విస్సాప్రగడ సాహిత్యం రాశారు. బెన్నీ దయాల్ తన ఎనర్జిటిక్ గాత్రంతో పాటకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చారు. పాటను ప్రశంసించిన దేవిశ్రీ ప్రసాద్, వినూత్న కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ సినిమా మంచి వి జ యం సాధించాలని చిత్రబృందా నికి శుభాకాంక్షలు తెలిపారు.నిర్మాత వేణు దోనేపూడి మా ట్లా డుతూ.. మేఘాలయలోని చిరపుంజి వంటి ప్రత్యేకమైన లొకేషన్లలో పూర్తిస్థాయిలో చిత్రీకరణ జరుపుకున్న తొలి దక్షిణాది చిత్రంగా 'బా బా బ్లాక్ షీప్' నిలుస్తుందని తెలిపారు. షూటింగ్ పూర్తయి ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశలో ఉన్నాయని చెప్పారు. దసరా సందర్భంగా అక్టోబర్ 9న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.ఈ చిత్రంలో టినను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, కార్తికేయ, విస్మయశ్రీ, మాళ్వీ మల్హోత్రా, రాజా రవీంద్ర, అనీష్ కురివిల్లా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# 'ఫౌజీ' రిలీజ్‌పై కొనసాగుతున్న ఉత్కంఠ

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం నాటి యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.


అయితే తాజాగా సినిమా విడుదల తేదీపై సోషల్ మీడియాలో పలు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. షూటింగ్, నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా డిసెంబర్ 3న సినిమా విడుదల కావడం కష్టమంటూ ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు అనుకున్న తేదీకే సినిమాను విడుదల ేసేందుకు మేకర్స్ వేగంగా పనులు పూర్తి చేస్తున్నట్లు సమాచారం.సినిమా పనులను మూడు యూనిట్లుగా విభజించి ఏకకాలంలో కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక యూనిట్ రిహార్సల్స్, ప్రీప్రొడక్షన్ పనులు చూసుకుంటుండగా, మరో టీమ్ ప్యాచ్ వర్క్‌పై దృష్టి పెడుతున్నట్లు సమాచారం. కీలక దర్శకత్వ పనులను మరో బృందం పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు సంబంధించిన షూటింగ్, ఇతర పనులను సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో చిత్రబృందం పనిచేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డిసెంబర్ 3న సినిమాను థియేటర్లలోకి తీసుకురావడమే లక్ష్యంగా షూటింగ్‌ను వేగవంతం చేస్తున్నట్లు తెలుస్తోంది.ఓటీటీ డీల్‌కు సంబంధించి కూడా గతంలో పలు ప్రచారాలు వచ్చినప్పటికీ వాటిపై అధికారిక స్పష్టత



లేదు. దీంతో ప్రస్తుతానికి 'ఫౌజీ' విడుదల తేదీపై నెలకొన్న సందిగ్ధతకు మేకర్స్ ప్రకటనతోనే తెరపడే అవకాశం ఉంది.హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తున్నారు. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, చైత్ర జె. అచార్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.మొత్తంగా 'ఫౌజీ' డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు వస్తుందా? లేక మరోసారి వాయిదా పడుతుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. దీనిపై అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# భాగ్యశ్రీ బోర్సేకు మరో బిగ్ ఆఫర్?

'మిస్టర్ బచ్చన్'తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన మోడల్, నటి భాగ్యశ్రీ బోర్సే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. తొలి చిత్రం ఆశించిన విజయం అందుకోకపోయినా, ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత 'కింగ్‌డమ్', 'ఆంధ్రాకింగ్ తాలూకా' వంటి చిత్రాల్లో పెద్దగా నటనకు అవకాశం లేకపోయినా, అందంతో అభిమానులను మెప్పించింది.అయితే 'కాంత', 'లెనిన్' చిత్రాలు భాగ్యశ్రీ కెరీర్‌కు కీలక మలుపుగా మారాయి. ముఖ్యంగా 'కాంత'లో నటనకు ప్రశంసలు అందుకోవడంతో పాటు, 'లెనిన్'లో తన పాత్రతో ఆకట్టుకుంది. దీంతో గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్లను కూడా చేయగలనని నిరూపించుకుంది. ఈ క్రేజ్‌తో ఆమె రెమ్యునరేషన్ కూడా పెరిగినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇక భాగ్యశ్రీకి మరో భారీ అవకాశం దక్కినట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న నేచురల్ స్టార్ నాని ప్రాజెక్ట్ 'బ్లడీ రోమియో'లో ఆమె కథానాయికగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్త అధికారికంగా ఖరారైతే నాని సరసన తొలిసారి నటించే అవకాశం భాగ్యశ్రీకి దక్కుతుంది. అదే జరిగితే ఆమె కెరీర్ మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034